రాగం: బౌళి

తాళం: ఆది

ఎక్కడి మానుష జన్మంబెత్తిన ఫలమేమున్నది

నిక్కము నిన్నే నమ్మితి నీ చిత్తంబికను

1. మరువను ఆహారంబును మరువను సంసార సుఖము

మరువను ఇంద్రియ భోగము మాధవ నీ మాయ

మరచెద సుజ్ఞానంబును మరచెద తత్వరహస్యము

మరచెద గురువును దైవము మాధవ నీ మాయ

2. విడువను పాపము పుణ్యము విడువను నా దుర్గుణములు

విడువను మిక్కిలి యాసలు విష్ణుడ నీమాయ

విడిచెద షట్కర్మంబును విడిచెద వైరాగ్యంబును

విడిచెద నాచారంబును విష్ణుడ నీ మాయ

3. తగిలెద బహులంపటముల తగిలెద బహుబంధంబుల

తగులను మోక్షపు మార్గము తలపున ఎంతైనా

అగపడి శ్రీవేంకటేశ్వర అంతర్యామివై

నగినగినను నీవేలితి నాకా ఈ మాయ